## తప్పుడు ప్రచారం చేసినవారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు : ఎమ్మెల్యే

**నర్సాపూర్, డిసెంబర్ 5, ప్రభాతవార్త :**

సోషల్ మీడియాలో తనపై తప్పుడు ప్రచారాలు చేసిన వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు కొందరు తన పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేయడం పట్ల ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు తన పై దుష్ప్రచారం చేసిన వారి పై పోలీస్ స్టేషన్ లో సిఐ షేక్ లాల్ మధార్ కు పిర్యాధు చేసినట్లు తెలిపారు.ఇందుకు బాద్యులైన వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు.తన పై తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. బిఆర్ఎస్ పార్టీలో నే ఉంటు ప్రజలకు సేవలు అందిస్తానని పేర్కోంటు బిఆర్ఎస్ పార్టీ వీడి వెళ్ళె ప్రసక్తే లేదన్నారు.ప్రజల ఆశీర్వాదంతో తనను నర్సాపూర్ ఎమ్మెల్యేగా గెలిపించి నందున నియోజకవర్గ ప్రజలకు, బిఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. తన పై తప్పుడు ప్రచారాలు చేసిన వారి పై చట్టరిత్యా చర్యలు తీసుకొని శిక్షించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కోరారు.




## ద్విచక్ర వాహనం పైనుంచి పడి వ్యక్తి మృతి

**కొల్చారం,డిసెంబర్ 5 ప్రభాతవార్త:** అదుపుతప్పి ద్విచక్రవాహనం రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన డబ్ల్యూ మెటల్ క్రాస్ బారియర్‌కు ఢీకొనడంతో తీవ్ర గాయాలై ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన కొల్చారం గ్రామశివారులోని లోతువాగు సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హన్మకొండకు చెందిన కర్రెంగుల రణధీర్(27) వారంరోజులుగా మెదక్ పట్టణంలోని ఒక సీడ్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటీవ్‌గా పనిచేస్తున్నారు. అంతకుముందు హన్మకొండలో పనిచేసేవారు. అయితే మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై మెదక్ నుండి హైదరాబాద్ వైపుకు వెళ్తుండగా మార్గమధ్యలో కొల్చారం గ్రామ శివారులోని జాతీయ రహదారి (ఎన్‌హెచ్765డీ)పై లోతు వాగు సమీపంలోకి వెళ్లగానే మృతుడు తన ద్విచక్ర వాహనాన్ని అజాగ్రత్తగా నడపటం వల్ల అదుపు తప్పి రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన డబ్ల్యూ మెటల్ క్రాస్ బారియర్‌కు ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సాయికుమార్ తెలిపారు.



రాజీనామా పత్రంపై సంతకం చేస్తున్న ఊడెం కృష్ణారెడ్డి

## ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి రాజీనామా

**గజ్వేల్, డిసెంబర్ 5 (ప్రభాతవార్త):** మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి హరీష్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి సహకారంతో బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆత్మ కమిటీ చైర్మన్‌గా తనను నియమించి రైతులకు సేవచేసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి మంగళవారం చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయినందున తాను పాలకవర్గంతో కలిసి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే కొత్త ప్రభుత్వంలో రైతుల సమస్యలపై పోరాటానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమం కోసం పని చేశామని, ముఖ్యంగా రైతులకు సమయానికి ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటు రైతులు పండించిన పంటలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలవద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశామన్నారు. నాతో పాటు ఉన్న పాలకవర్గ సభ్యులు రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్లు హనుమంతరెడ్డి, ఎల్ల వెంకటేశం, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావును కలిసిన మున్సిపల్ చైర్మన్ రాజమౌళి



హరీష్‌రావుతో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పాలకవర్గ సభ్యులు

**గజ్వేల్, డిసెంబర్ 5 (ప్రభాతవార్త):** అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేట నుండి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిచిన తన్నీరు హరీష్‌రావును గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేటలో హరీష్‌రావుకు తిరుగులేదని, 80వేల పైచిలుకు మెజార్టీతో గెలువడంపట్ల సంతోషం వ్యక్తం చేశారు. అలాగే నూతనంగా దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిచిన కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు రహీం, బొగ్గుల చందు, గోపాల్‌రెడ్డి, అల్వాల బాలేష్, అత్తెల్లి శ్రీను, రజితగౌడ్, బాలమణి, కో-ఆప్షన్ సభ్యులు ఇస్మాయిల్, గంగిశెట్టి రాజు, ఉమర్, నాయకులు దుర్గాప్రసాద్, వంటేరు ఉమారాణి, పంబాల శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## తుఫానుతో రైతుల్లో ఆందోళన

**వెల్దుర్తి, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** తుఫాను ప్రభావంతో మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండురోజుల ముందు వరకు మంచిగా ఉన్న వాతావరణం ఒకేసారి మార్పు వచ్చి తుఫాన్ వస్తుందనే విషయం తెలియడంతో సోమవారం రాత్రి నుండి వర్షం పడటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన వరి పంట తడుస్తుండటంతో, అలాగే కొంత వరి పంట చేతికి అందివచ్చే సమయంలో తుఫానురావడంతో రైతులను ఆందోళనకు గురి చేస్తుంది. తుఫాన్ తీవ్రంగా ఉండి భారీ వర్షం కురిస్తే రైతులు నష్టపోవాల్సి ఉంటుందని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**-న్యాయమూర్తి హన్మంతరావు**

**సంగారెడ్డి టౌన్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వుల మేరకు, జిల్లా న్యాయ సేవాదికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకర్‌రావు సూచనల మేరకు మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె హను మంతరావు పట్టణంలోని ఎస్‌బిఐ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా హనుమంతరావు శిక్షణ కేంద్రంలో బాలబాలికలకు, మహిళలకు అందిస్తున్న శిక్షణ(మగ్గం)ను పరిశీలించారు.ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన పొంది ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ ట్రైనింగ్ అధికారి, డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఉన్నారు.

## రేవంత్‌రెడ్డి సిఎం..సంబరాలు జరుపుకున్న పార్టీ శ్రేణులు

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 5, ప్రభాతవార్త :**

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు)లు అన్నారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు సిఎంగా రేవంత్‌రెడ్డి పేరు ఖారారు చేయడంతో మంగళ వారం రాత్రి సిద్దిపేట పట్టణంలోని పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వద్ద టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన అరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేసి తీరుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుంతుందనే ప్రజలు పట్టం కట్టారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి రాజు, సతీష్, గయాజొద్దీన్, షాపొద్దీన్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



సంబరాలు జరుపుకుంటున్న పార్టీ శ్రేణులు

# మిచౌంగ్ తుఫాన్‌తో రైతుల్లో ఆందోళన

◆ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు తప్పని తిప్పలు ◆ ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోన్న అవేదనలో అన్నదాతలు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా వర్షలు కరిసే అవకాశం ఉండడంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చిన రైతులు అందోళన చెందుతున్నారు. ఇప్పటికే వాతావరణం పూర్తిగా మారిపోయి చిరుజల్లులు పడుతుండడంతో కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన వరి ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోనని అందోళన చెందుతున్నారు. జిల్లా ఖరీప్‌సీజనల్‌లో ధాన్యం కొనుగోలు చేయడానికి ఐకెపి 211, పిఎసిఎస్ 203, మెప్మా అధ్వర్యంలో 6 కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఇప్పటి వరకు దాదాపు 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పటీవరకు బాగానే ఉన్నప్పటికీ మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల చాల వరకు గ్రామ శివారులలోని బహిరంగ స్థలాలలో ఏర్పాటు చేయడంతో ధాన్యం వర్షాలకు తడవకుండా ఉండడానికి నానాతంటాలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చిన ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ భారీ వర్షం కురుస్తుందోని రైతులు వాపోతున్నారు. భారీగా వర్షం కురిస్తే ధాన్యం తడిసి పోతుందన్న అందోళన రైతుల్లో నెలకొంది. వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి టాల్ఫిన్ కవర్లు కప్పిఉంచినప్పటికి భారీవర్షం పడితే మాత్రం ధాన్యం ఎక్కడ కొట్టుకుపోతుందని రైతులు అందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మి చౌంగ్ తుఫాన్‌తో తమకు తిప్పలు తప్పటట్లు లేవని రైతులు వాపోతున్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై టాల్ఫిన్ కవర్లు కప్పి ఉంచిన దృశ్యం



గ్రామ పంచాయతీ ఎదుట అందోళన చేస్తున్న గ్రామస్తులు

## ఇథనాయిల్ ఫ్యాక్టరీ నిలిపివేయాలంటూ గ్రామస్థుల ఆందోళన

**బెజ్జంకి, డిసెంబర్ 5, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గుగ్గిళ్ల గ్రామంలో సర్వే నంబరు 55/559/561లో గల భూమిలో ఇథనాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాట నిలిపివేయాలని గ్రామస్థులు మంగళవారం గ్రామ పంచాయతీ ఎదుట నిరవధిక సమ్మెకు దిగారు. కొద్ది నెలల క్రితం ఫ్యాక్టరీ పై పూర్తి వివరాలు తెలుపకుండా గ్రామంలో యువకులకు ఉపాధి కల్పిస్తామని మాయమాటలు చెప్పి గ్రామ పంచాయతీ నుంచి ఎన్‌ఓసీ పత్రాన్ని తీసుకొని ఇప్పుడు అథనాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని చెప్పడంతో పాలకవర్గంతోపాటు గ్రాస్తులు ఫ్యాక్టరీ ఏర్పాటు నిలిపివేయాలని కోరుతూ జిల్లా పాలానాధికారికి, సంబంధిత అధికారులకు వినతి పత్రాలను అందజేశామని తెలిపారు. ఫ్యాక్టరీ ఏర్పడడం వలన ఉద్యోగాల మాట దేవుడెరుగు కానీ గ్రామంలో వాయు కాలుష్యంతో పాటు రోగాల పాలవుతామని గ్రామస్తులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సత్వరమే పరిశ్రమను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ధాన్యం డబ్బుల కోసం రైతుల పడిగాపులు




బ్యాంకుఎదుట డబ్బులకోసం క్యూలో చెప్పులుపెట్టి నిరీక్షిస్తున్న రైతులు

**వెల్దుర్తి, డిసెంబర్ ప్రభాతవార్త:** ఆరుగాలం కష్టించిపండించిన పంటను రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించగా ఆ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ అయినప్పటికీ బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవుడు కరుణించినా.. పూజరి కరుణించలేదు అన్న చందంగా రైతులకు ధాన్యం డబ్బులు ఖాతాల్లో పడ్డా అవి తీసుకోవడానికి బ్యాంకు అధికారులు ఆన్‌లైన్ సాకుతో డబ్బులు ఇవ్వడంలేదని నిరసిస్తూ మంగళవారం వివిధ గ్రామాల రైతులు ఉదయం 8 గంటలకే చెప్పులను క్యూ లైన్‌లో పెట్టి బ్యాంకుల మందు నిరీక్షిస్తున్నారు. బ్యాంకు సమయానికి బ్యాంకు అధికారులు రావడంతో వారిని డబ్బులు అడగగా ఆన్‌లైన్ రావడం లేదంటూ సమాధానం ఇస్తున్నారని, దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిసనిప్పటికీ డబ్బులు ఇవ్వడానికి బ్యాంకు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, పై అధికారులు స్పందించి తమ డబ్బులను ఇప్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

జడ్‌హెచ్‌బి పి-3: విలేఖరులతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు



నర్సరీని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్

## వచ్చే ఏడాది హరితహారంలో సిద్దిపేటలో 1,51,000 మొక్కలు నాటడానికి సర్వం సిద్ధం

**మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్**

**సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 5, ప్రభాతవార్త :** 2024-25 సంవత్సరం హరితహారం కార్యక్రమానికి వేప, మహాగని, స్పతోడియా, బోగన్ విల్(తెలుపు రంగు, అకుపచ్చ, గులాబీ, పసుపు రంగు), బహోనియ వంటి పలు రకాల మొక్కలను సిద్ధం చేస్తున్నట్లు సిద్దిపేట మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. మంగళవారం రంగనాయక సాగర్ వద్ద నర్సరీలో సిద్ధం చేసిన మొక్కలను అయన పరిశీలించారు. వచ్చే యేడాదికి గానూ సిద్దిపేట పట్టణంలో హరితహారంలో భాగంగా 1,51,000 మొక్కలు నాటాల్సి ఉందన్నారు. మున్సిపల్ పాలక వర్గంతో పాటు ప్రజల సహకారంతో పట్టణం పచ్చదనంతో ఉందన్నారు. వచ్చే యేదాది సైతం సిద్దిపేట పట్టణాన్ని పచ్చదనంగా మార్చుకుందామని తెలిపారు. రంగనాయక సాగర్ వద్ద నర్సరీని మరింత విస్తరించటకై మరో 4 ఎకరాల భూమిని చదును చేపించి మొక్కల పెంపకాన్ని మరింత సులభతరం చేస్తామన్నారు. హరిత హారంలో భాగంగా పట్టణంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం జరుగుతుందన్నారు. మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అదేశాల మేరకు వచ్చే యేడాది హరిత హారంలో మొక్కలు నాటడానికి సర్వం సిద్ధం చేస్తున్నట్లు కమిషనర్ వివరించారు.

## రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ

**కొల్చారం, డిసెంబర్ 5 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఎనగండ్ల గ్రామ శివారులోని దుంపలకుంట్ల సమీపంలోగల శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి చొరబడి బీభత్సం సృష్టించారు. ఆలయంలోని 70 వేల విలువ చేసే వస్తువులు ఇన్వర్టర్, ఆంప్లిఫైర్, సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌లను దొంగలించారు. గత పదిహేను రోజుల క్రితం ఇలాగే ఆలయంలోకి చొరబడి దుండగులు హుండీని పగులగొట్టి నగదును చోరీ చేసినట్లు గౌడ కులస్తులు తెలిపారు. గౌడ కులస్తులు ఈ సమాచారం పోలీసులకు ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి సీసీ టీవీ ఫుటేజిని చూసి దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు.



చోరీకి పాల్పడుతున్న దుండగుడు (సీసీ టీవీ పుటేజీ)



సునీతారెడ్డి అధ్వర్యంలో ఆంజనేయస్వామికి మొక్కులుతీర్చుకున్న అయ్యప్పలు

## మొక్కులు తీర్చుకున్న అయ్యప్ప స్వాములు

**నర్సాపూర్, డిసెంబర్ 5, ప్రభాతవార్త :** నర్సాపూర్ ఎమ్మెల్యేగా వాకిటి సునీతాలక్ష్మారెడ్డి విజయం సాధించినందకుగాను అయ్యప్పస్వాములు చాకరిమెట్ల శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం మొక్కులు తీర్చుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి నర్సాపూర్ ఎమ్మెల్యేగా సునీతాలక్ష్మారెడ్డి భారీ మెజార్టీతో గెలిచినట్లయితే చాకరిమెట్ల దేవాలయంలోని శ్రీఆంజనేయ స్వామికి 108 కొబ్బరికాయలు, పూజలు చేయిస్తామని అయ్యప్పస్వాములు ముడుపులు కట్టి మొక్కుకున్నారు. ఈ మేరకు ఆమె ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిడంతో మంగళవారం సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పూజలు చేయించి అనంతరం 108 కొబ్బరి కాయలు కొట్టి మొక్కును తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ శ్రీఅయ్యప్పస్వామి దయవల్ల ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించానన్నారు. కార్యక్రమంలో దేవగౌడ్, గురుస్వామి, నర్సాగౌడ్ గురుస్వామి, రాములుగరుస్వామి, శ్రీనివాస్‌గౌడ్ గురుస్వామి, మహేశ్, గంగరాంగౌడ్, గణేశ్, అశోక్, బన్నీ, ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్, శ్యామ్‌గౌడ్, సాయి, రవి, రాజు, విజయ్, రాములు, శేఖర్, కిరణ్, మణి, రాములు, మణికంఠగౌడ్, నాగరాజు, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులోనే సురక్షిత ప్రయాణం

**గజ్వేల్ టౌన్, డిసెంబర్ 5(ప్రభాతవార్త):**

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో నుండి అయ్యప్ప స్వాములకు శబరిమలై యాత్రకుగానూ సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులను అద్దెకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో వెళ్తే ఆలయం దగ్గర వరకు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. అలాగే శబరిమలైలో స్వాము లకు గైడ్ చేయడానికి ఆర్టీసీ ప్రతినిధులు అందుబాటులో ఉంటారని, బస్సులో ఒక గురుస్వామి, ఇద్దరు కన్నె స్వాములు, ముగ్గురు వంట వారికి సీటు లేకుండా ప్రయాణం అనుమతించబడునని పేర్కొన్నారు. స్వాములు తమకు తాముగా బస్సు బుక్ చేసుకున్నట్లయితే గురు స్వామికి మీరు ప్రయాణం చేసే రోజులలో ప్రతి రోజుకు రూ.300 కమిషన్ ఇవ్వబడునని పేర్కొన్నారు.

సిఎంగా పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డిని ప్రకటించడం హర్షనీయం

## రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు పోతుంది

**టిపిసిసి చేనేత విభాగం చైర్మన్ గుడూరి శ్రీనివాస్**

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 5, ప్రభాతవార్త :**

రాష్ట్ర సిఎంగా పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డిని నియమిస్తూ ఢిల్లీ కాంగ్రెస్ అగ్రనేతలు నిర్ణయం తీసుకోవడం పట్ల టిపిసిసి చేనేత విభాగం చైర్మన్, సిద్దిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుడూరి శ్రీనివాస్(ఎస్టీడి) హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం అయన సిద్దిపేట జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సిఎంగా రేవంత్‌రెడ్డి పేరును ప్రకటించడంతో పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాకంగాంధీ, మల్లికార్జున ఖర్గేలకు అయన కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతోపాటు బడుగు బలహీన వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అరు గ్యారెంటీలను రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలు జరిగి తీరుతాయన్నారు. అరు గ్యారెంటీల అమలుతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం జరగలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ప్రజలు పట్టం కట్టారని తెలిపారు.

## చిరాగ్‌పల్లి సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి

**బిఆర్ఎస్ నేతలు**



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**జహీరాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చిరాగ్‌పల్లి సర్పంచ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బండి మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం పోలీసు ఠాణాలో కాంగ్రెస్ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బండి మోహన్ మాట్లాడుతూ దళిత ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావుపై అసభ్యంగా, ఇష్టానుసారంగం మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యేను దూషించిన సన్నివేశాలను రుజువులతో డిఎస్‌పి ఫిర్యాదు చేశామన్నారు. ఎమ్మెల్యేను దూషించిన సర్పంచ్‌ను ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తట్టు నారాయణ, సొసైటీ చైర్మన్ మచ్చేందర్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు ఎర్రోళ్ల శివప్ప, మండల అధ్యక్షులు రాజు, ఎంపిటిసి సభ్యులు బాబు, అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు లక్ష్మీ కాంత్, ఎస్టీ సెల్ అధ్యక్షులు హీరు రాథోడ్, నాయకులు మోహియోద్దిన్, ఇజ్రాయిల్ బాబి, చిరాగల్‌పల్లి మోహన్‌రెడ్డి, బుడుగ జంగం జిల్లా అధ్యక్షులు కళ్లెం రవి, హోలేయే దాసరి సంఘం బాధ్యులు టకుమట్ల గణేశ్, చంద్రయ్య, శ్రీను, జగదీష్, దీపక్, లవన్, నాతన్, మధు, పవన్, సందీప్, సామేల్, శివరాజ్, జగన్, ఉపేందర్, మధు, ప్రశాంత్, చిన్న, ప్రవీణ్, మింటు తదితరులు పాల్గొన్నారు.

## గోశాలకు పశుగ్రాసం అందజేత

**శివ్వంపేట, డిసెంబర్ 5 ప్రభాతవార్త:**

శివ్వంపేట మండలం దొంతి గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి దేవాలయం ఆధీనంలో ఉన్న గోశాలకు ఉసిరికపల్లి గ్రామానికి చెందిన వ్యాపారి గుండం వేణుకుమార్ మంగళవారం 10 వేల రూపాలయ విలువ చేసే పశుగ్రాసాన్ని విరాళంగా అందజేయడం జరిగింది. దొంతిలోని గోశాలలో గోమాతల సంరక్షణార్థం దాతలు ముందుకు వచ్చి పశుగ్రాసం అందజేయడానికి ముందుకు రావాలని నిర్వాహకులు చిగుళ్లపల్లి శ్రీనివాస్‌గుప్త విజ్ఞప్తి చేశారు. పశుగ్రాసం కొరత ఉన్న విషయం తెలుసుకొని విరాళాల రూపంలో పశుగ్రాసం అందజేసి గోమాతల ఆశీర్వాదం పొందాలని కోరారు. గుండం వేణు కుమార్ కుటుంబ సభ్యులను ఆ భగవంతుడు కరుణా కటాక్షాలు కలుగజేయాలని గోశాల నిర్వహణ కమిటీ ద్వారా కోరుతున్నట్లు తెలిపారు. పశుగ్రాసం అందజేస్తున్న ధాతలకు గోశాల తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు శ్రీనివాస్‌గుప్త చెప్పారు.

# ప్రశాంత వాతావరణాన్ని చెడగొడుతున్న కాంగ్రెస్ : ఎమ్మెల్యే

**జహీరాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**

ప్రశాంతతకు నిలయంగాఉన్న జహీరాబాద్ నియోజకవర్గాన్ని కాంగ్రెస్ నాయకులు చెడగొడుతున్నారని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ స్థానికేతర కాంగ్రెస్ నాయకులు కొందరు బిఆర్ఎస్ నాయకులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ ప్రజల మధ్య మనస్పర్థలు వచ్చేలా చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీ మంత్రులు బాగారెడ్డి, జెట్టి గీతారెడ్డి, మహ్మద్ ఫరీదుద్దీన్‌ల హయాంలో నియోజకవర్గ ప్రజలు కలిసి మెలసి ఉన్నారని, ఎన్నికలు ముగిసేంత వరకే రాజకీయాలు ఉండాలని, ఎన్నికల ముగిసాక అందరు కలిసి మెలసి ఉండాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. తనను రెండవ మారు శాసన సభ మెట్లు ఎక్కేలా కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే మాణిక్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని హామి చేశారు. కార్యక్రమంలో టిఎస్ ఐడిసి చైర్మన్ మహ్మద్ తన్వీర్, సిడిసి చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, సొసైటీ చైర్మన్ మచ్చేందర్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, నాయకులు మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు బండి భువన్ జాంగీర్ అబ్దుల్లా, యూనుష్, ఇజ్రాయిల్ బాబి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## గట్టేపల్లిలో ప్రపంచ మట్టి దినోత్సవం



**ధారూర్ డిసెంబరు5,ప్రభాతవార్త :** మండల పరిధిలోని గట్టేపల్లి గ్రామంలో భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ,ఫార్మర్ ఫస్ట్ ప్రోగ్రాంలో (ఎఫ్ఎఫ్‌పి) భాగంగా నేల,నీరు జీవితానికి ఆధారం అనే అంశంపై ప్రపంచ మట్టి దినోత్సవం మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ....ప్రపంచ మట్టి దినోత్సవ ఆవిర్భావం దాని ప్రాముఖ్యత మట్టి మరియు నీటి ఆవశ్యకతను వివరించారు.అంతేకాకుండా భావితరాలకు మనం సారవంతమైన భూమిని,నీటిని ఎట్లా అందించాలని దానిపై రైతులకు సూచించారు.ఏడిఏ వినోద్ మాట్లాడుతూ...రైతులు శాస్త్రవేత్తలతో సంప్రదించి వారి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఝాన్సీ లక్ష్మి,ఫీల్డ్ అసిస్టెంట్ కిరన్ సౌజన్య రైతులు పాల్గొన్నారు.

### రంగారెడ్డి గెలుపుకు కృషి చేసిన వారందరికి ధన్యవాదాలు

-కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు మొహ్మద్‌నగౌస్

**యాచారం డిసెంబర్ 5,ప్రభాతవార్త :** ఎన్ని ఆటంకాలు కలిగించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో,ఇబ్రహీంపట్నంలో అధిక మోజారిటీతో గెలవడం ఎంతో అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొహమ్మద్ గౌస్ తెలిపారు. యాచారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...ఇబ్రహీంపట్నం నియోజకవర్గం 40ఏళ్ల కల కాంగ్రెస్ పార్టీ గెలవడం గర్వించదగ్గ విషయమన్నారు.కెసిఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని సకల జనులకు ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు సంక్షేమం పొందుతారని నిరుపేదలందరికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు.అర్హులకే సంక్షేమం అందాలంటే కాంగ్రెస్ తోటే సాధ్యమన్నారు.మల్‌రెడ్డి రంగారెడ్డి 40వేల మె జార్టీ రావడం ఎంతో అద్భుతం అన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫారంకు కంచె వేయండి

### -సర్పంచ్ భాషయ్య



ధర్మన్న గూడలో శాఖ గురై మృతి చెందిన గొర్రెతో సర్పంచ్ భాషయ్య

**యాచారం డిసెంబరు5,ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని ధర్మన్నగూడ గ్రామంలో నూతనంగా బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌పార్మర్ వద్ద ఎర్తింగ్ సమస్య వల్ల కరెంట్ షాట్ రావడం జరుగుతుందని సర్పంచ్ మండల్ బాసయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన రావుల సింహయ్య చెందిన గొర్రెలు మూడు కరెంట్ షాక్ గురై ఒకటి మరణించింది.సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని గొర్రె కాపరులను ప్రభుత్వం ఆదుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు.గ్రామ సమీపంలో ఉన్న బస్టాప్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు కంచె ఏర్పాటు చేయాలని యాచారం విద్యుత్ ఏఈ సందిప్ వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.సమస్య పరిష్కరించకపోతే ఆందోళన తప్పదని డిమాండ్ చేశారు.

### సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా నర్సింహా రెడ్డి

**బంట్వారం,డిసెంబర్ 5 (ప్రభాతవార్త) :** మండల సర్పంచుల సంఘం అధ్యక్షునిగా మాలసోమారం సర్పంచ్ జి నర్సింహ్మారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది బంట్వారం, సుల్తాన్‌పూర్, యాచారం, బొపునారం, సల్బత్తాపూర్ గ్రామాల సర్పంచ్‌లు లావణ్య, నర్సిములు, బల్వంత్‌రెడ్డి, కల్పన, వెంకటమ్మలు పేర్కొన్నారు. బుధవారం వారు విలేఖరులతో మాట్లాడుతూ...గత కొన్ని నెలలుగా చోటుచేసుకున్నా రాజకీయ పరిణామాల దృష్ట్య ఇప్పటివరకు కు కొనసాగిన సంఘం అధ్యక్షుడు బస్వాపూర్ సర్పంచ్ నర్సిములుకు తమ మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు తీర్మానించడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఇదే సందర్భంగా జి నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి సంఘం అధ్యక్షునిగా ఎన్నుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, ఆలంపల్లి శ్రీనివాస్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా నిలవడం అభినందనీయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న విష్ణు అన్న యువసేన సభ్యులు

**పెద్దేముల్, డిసెంబరు 5,ప్రభాతవార్త:** బాధిత కుటుంబాలకు పెద్దేముల్ ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మెన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి అండగా నిలవడం అభినందనీయమని విష్ణు అన్న యువసేన సభ్యులు బోయిని నర్సిములు, రవి కిరణ్, పిట్ల రాములు, బోయిని శ్రీకాంత్, రాజు శివరాజు తదితరులు అన్నారు. పెద్దేముల్ గ్రామానికి చెందిన బోయిని చంద్రప్ప కుమారుడు బోయిని అరవింద్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న విష్ణువర్ధన్‌రెడ్డి యువసేన సభ్యుల ద్వారా మృతుని కుటుంబ సభ్యులకు రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా విష్ణు అన్న యువసేన సభ్యులు మాట్లాడుతూ నిరుపేదలకు తనవంతు సహాయం చేయడంలో ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి ముందు వరుసలో ఉంటారని అన్నారు. మానవసేవే మాధవసేవ అన్న పదానికి విష్ణువర్ధన్‌రెడ్డి నిదర్శనమని అన్నారు. నిరుపేదల పాలిట విష్ణువర్ధన్‌రెడ్డి పెన్నిదిగా నిలిచారని కొనియాడారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

**మర్పల్లి అక్టోబర్ 6ప్రభాతవార్త :** మర్పల్లి మండలంలోని గణపూర్ గ్రామానికి చెందిన మేతరి లాజర్ పోమవారం నాడు అనారోగ్యంతో మృతి చెందగా ఈవిషయాన్ని తెలుసుకున్న యస్.కే ఆర్ ట్రస్టు ఛైర్మన్ జిల్లా గ్రంథాలయా మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి,అంత్యక్రియలనిమిత్తం వారి కుటుంబానికి5 వేల రూపాయలు ఆర్థికసహాయం చేయగా మంగళవారం పంచలింగాల్ సర్పంచ్ సురేందర్‌రెడ్డి. గణపూర్‌లోని మృతుడి కుటుంబానికి వెళ్లి కుటుంబసభ్యలను పరామర్శించి 5వేల రూపాలను అంధజేశారు.ఈకార్యక్రమంలో నర్సింలు లాలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# 101వ మెథడిస్ట్ క్రిస్టియన్ జాతర ప్రారంభం



జాతరను ప్రారంభిస్తున్న బిషప్‌లు

**ధారూర్ డిసెంబర్5,ప్రభాతవార్త :** ధారూర్ మండల పరిధిలోని స్టేషన్ ధారూర్,దోర్నాల్ గ్రామాల మధ్య నిర్వహించే మెథడిస్ట్ క్రిస్టియన్ 101వ జాతర మంగళవారం ప్రారంభమైంది.బిషప్‌లు ,ఎల్ ఎన్ కర్కరి,ఎంఎ డానియల్ ప్రధాన ద్వారం వద్ద ప్రార్థన చేశారు.కాగ్న నది ఒడ్డున జరిగే మెథడిస్ట్ జాతర ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్రం నుంచి కాకుండా దక్షిణాది రాష్ట్రాల నుంచి తరలిస్తారు.సుమారు 10 దశాబ్ధాల నుంచి మెథడిస్ట్ క్రైస్తవుల జాతర జరుగుతున్నాయి.

### మెథటిస్ట్ క్రైస్తవ జాతర చరిత్ర

1921లో బీదర్ నుంచి హైదరాబాద్ రైలులో ప్రయాణిస్తున్న ఇద్దరు క్రైస్తవులు హైదరాబాద్‌కు బయలుదేరారు.ఈ క్రమంలో ధారూర్ రైల్వే స్టేషన్ చేరుకున్న రైలు సాంకేతిక కారణాలతో మూడు గంటలు ఆలస్యమవుతుందని రైల్వే అధికారుల ద్వారా తెలుసుకున్నారు.దీంతో ప్రయాణీకుల్లో ఆందోళన మొదలైంది.ఈ సందర్భంగా రెవరెండ్ సీమన్స్ అతని మిత్రుడు జేటి సీమండ్స్ అనే క్రైస్తవ ప్రయాణికులు పక్కనే ఉన్న కాగ్నా నది ఒడ్డుకు చేరుకుని ఓ ఇప్పచెట్టు కింద కూర్చుని ఏసు నామమున ప్రార్థనలు చేశారు.ప్రార్థనలు ముగించిన అనంతరం రైలు బయలుదేరుతుందని రైల్వే అధికారులు ప్రకటించారు.సీమన్స్,సీమండ్లకు చాలా సంతోషం కలిగింది.ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఇప్పచెట్టుకు మరోసారి ప్రార్థనలు చేసి హైదరాబాద్ బయలుదేరివెళ్లారు.ఆ తర్వాత హైదరాబాద్‌లో తాము వెళ్లిన పని పూర్తి కావడంతో సంతోషించిన మిత్రులిద్దరు కాగ్నా నది ఒడ్డున గల ఇప్పచెట్టు కింద మహిమ ఉందని,దేవుడు ఉన్నాడని భావించి మరుసటి సంత్సరం ఏ రోజైతే కాగ్నా నది పక్కన ప్రార్థనలు చేశారో అదే రోజున ఆ స్థలానినన పవిత్రంగా భావించి ఉత్సవాలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేయడం ప్రారంభించారు.అప్పటి నుండి ప్రతి సంవత్సరం వారు వారి కుటుంబ సభ్యులు, బంధువులు,స్నేహితులతో ప్రారంభమైన మెథడిస్ట్ జాతర నేడు లక్షలాది మందితో ప్రాంగణం కళకళలాడుతున్నది.



# అధైర్యపడకండి..అండగా ఉంటా

### -కార్యకర్తలపై దాడులను సహించేది లేదు
### -తాజా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

**కొడంగల్,డిసెంబర్ 5ప్రభాతవార్త**

సార్వత్రిక ఎన్నికల్లో ఓడినా..గెలిచినా తానె ఎల్లప్పుడు ప్రజలకు అండగా ఉంటానని,ఎవ్వరు కూడా అధైర్యపడవద్దని తాజా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం మొదటి సారి మంగళవారం కొడంగల్‌కు విచ్చేసిన ఆయన స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు,నాయకులను కలిశారు.అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతు కార్యకర్తలే నాకు బలం..బలగం అంటూ భావోద్వేగానికి లోనైయ్యారు.ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవిస్తున్నాని,ప్రజలు మార్పు కోరుకోవడంతోనే రాష్ట్రంతో పాటు కొడంగల్‌లోను కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందన్నారు.9 ఏళ్ళ బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి పనులు జరిగినట్లు పేర్కొన్నారు.కొడంగల్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడాన్ని తాను స్వాగతిస్తున్నట్లు తెలిపిన ఆయన నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులకు ప్రతిపక్షంగా సహకరిస్తానని,కొడంగల్‌కు సీఎం పదవి వచ్చినా సంతోషిస్తానని కొడంగల్ అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.గతంలో తాను మంజూరీ చేయించిన అభివృద్ధి పనులకు సంభందించి గిరిన తండాలకు రూ.6కోట్లు,పంచాయతీ రాజ్ రోడ్లకు రూ.6కోట్లు,ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.30కోట్లు,12 చెక్‌డ్యాంలకు గాను రూ.56కోట్లు,కొడంగల్,కోస్గీ మున్సిపాలిటీలకు అదనంగా మరో రూ.20కోట్లతో కలిపి మొత్తంగా 300 కోట్ల పనులకు సంభందించి నిధులు మంజూరీ కావడంతో పనులు పూర్తి చేయాలని ప్రస్తుత ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.అలాగే ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారెంటీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఎన్నికల వరకే రాజకీయాలని ఎన్నికలు ముగిశాక అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు.బొంరాస్‌పేట్,మద్దూర్ మండలాల్లో ఇటీవలే బీఆర్ఎస్ కార్యకర్తలపై జరిగిన దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరికి స్వేచ్చ ఉంటుందన్న ఆయన ఎలాంటి రాజకీయ కక్ష్యలకు తావు లేకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు సూచించారు.ప్రశాంతంగా ఉన్న కొడంగల్‌లో నిన్న,మొన్న జరిగిన సంఘటనలు సహించలేనివని రాజకీయాల్లో దాడులకు పాల్పడడం మంచి పద్దతి కాదని హితవు చెప్పారు.బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని తాను వారికి ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు.తమ పార్టీ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని,అవసరమైతే సీఎంతో పాటు డీజీపీకి ఫిర్యాదు చేసేందుకు వెనుకాడేది లేదన్నారు.ఇకముందు కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.ఎన్నికల్లో తన గెలుపు కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలు,నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మార్కెట్ కమిటీ వైస్‌చేర్మెన్ వాణీశ్రీ యాదవ్,మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్,మద్దూర్ సలీం,ముదిగండ్ల క్రిష్ణ,దామోదర్‌రెడ్డి,సర్పంచ్‌లు సయ్యద్ అంజద్,చాంద్‌పాషా,పీఏసీఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి,మహేందర్‌రెడ్డి,కోట్ల యాదగిరి,నరోత్తంరెడ్డి,మాజీ సర్పంచ్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న తాజా మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

## ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసి అభినందనలు తెలిపిన అవుశాపూర్ బీఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసిన అవుశాపూర్ బీఆర్ఎస్ నాయకులు.

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం అవుశాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు మంగళవారం రెండో దఫా ఎన్నికైన మల్లారెడ్డిని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్లారెడ్డిని గ్రామ నాయకులు కలిశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గ్రామ ఉప సర్పంచ్ ఎలుసాని అయిలయ్య యాదవ్, దొంకెని బిక్షపతి గౌడ్, మాజీ సర్పంచ్ పి. రమేశ్, వార్డు సభ్యులు బొడిగె శ్రీనివాస్ గౌడ్, కే. వీరేశం, కుశలవరెడ్డి, నాయకులు దయాకర్ రెడ్డి ఉన్నారు.

## ఇబ్రహీంపట్నం నుండి యాదగిరిగుట్టకు మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డి పాదయాత్ర



ఇబ్రహీంపట్నం నుండి పాదయాత్రగా వెళ్తున్న మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి

**యాచారం డిసెంబరు5,ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి 40వేల ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ఆయన కుమారుడు మల్‌రెడ్డి రంగారెడ్డి అభిషేక్ రెడ్డి సోమవారం ఇబ్రహీంపట్నం నుండి యాదాద్రి నరసింహస్వామి ఆలయం వరకు పాదయాత్రగా బయలుదేరారు.వందమంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో వర్షంలో తడుస్తూ మొక్కలు తీర్చుకునేందుకు పాదయాత్రగా బయలుదేరారు.ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎంతో ఉత్సాహంగా బయలుదేరారు.పట్నం నియోజకవర్గం మరింత అభివృద్ధి చేసినందుకు మల్‌రెడ్డి రంగారెడ్డి కృషి చేయాలని అంతే ఉత్సవంతో శ్రేణులు పని చేయాలని సాధారణ ప్రజలకు సంక్షేమ అందించేందుకు కృషి జరగాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

# బడుగులకు న్యాయం దక్కేనా?

### -ప్రజాబలం ముందు బోల్తా పడిన ధనబలం
### -బీసిల ఆశాకిరణం వీర్లపల్లికి మంత్రి వర్గంలో చోటు కల్పించాలి
### -ఉమ్మడి మండలాల మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్

**నందిగామ డిసెంబరు5,ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికలో వీర్లపల్లి శంకర్ ప్రజాబలం ముందు ఏ శక్తుల ధనబలం పని చేయక బోల్తా పడిందని కాంగ్రెస్ నేత,మాజీ ఉమ్మడి మండలాల ఎంపిపి ఎం.శివ శంకర్ గౌడ్ అన్నారు.నందిగామ మండలం చేగూరు గ్రామంలో ఆయన మాట్లాడుతూ...బిసి సామాజిక వర్గానికి చెందిన విద్యావంతుడు,షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలన్నారు.షాద్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అనే నావనడి సంద్రంలో కొట్టుమిట్టాడుతునన విపత్కర పరిస్థితులో నేనున్నానంటూ ఒడ్డుకు చేర్చి పార్టీకి పునర్జీవం పోసిన వీర్లపల్లి మంత్రి పదవికి అర్హుడని చెప్పారు.గడిచిన పదేళ్ల కాలంలో షాద్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనకబడిపోయిందని,వీర్లపల్లికి మంత్రి పదవి దక్కితే షాద్‌నగర్ షాన్‌దార్ నగరంగా రూపురేఖలు మారతాయని,లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టబోతారన్నారు.నిత్యకృషీవరుడు,పట్టువీడని విక్రమార్కుడిలా అసెంబ్లీలో గళమెత్తి నియోజకవర్గం అభివృద్ధికి నిధులు తెచ్చె దమ్మున్న,ధైర్యమున్న,సాహసమున్న వీర్లపల్లి శంకర్‌తోనే సాధ్యమన్నారు.వీర్లపల్లికి మంత్రి పదవి దక్కాలని ప్రజలందరూ కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారని అన్నారు.వీర్లపల్లికి మంత్రి పదవొస్తే విద్య,వైద్యం,విద్యుత్,వ్యవసాయ పారిశ్రామిక రంగాలలో గణనీయమైన పురోగతి సాధించి సబండ వర్గాల జీవితాలు వెలుగుతాయని పేర్కొన్నారు.

## శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



.శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం ప్రాంగణంలో జరిగిన అన్నదాన కార్యక్రమం దృశ్యం

**శామీర్‌పేట, డిసెంబరు 5, ప్రభాతవార్త** శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం శామీర్‌పేట రాజీవ్‌రహదారికి పక్కనే ఉన్న శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆ తరువాత మహా అన్నదాన కార్యక్రమాన్ని గౌడ సంఘం వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగింది. శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారిని భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి దర్శించుకుని ఆ తరువాత అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవికి వాణిశ్రీ రాజీనామా

**కొడంగల్,డిసెంబర్ 5ప్రభాతవార్త**

కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చేర్మెన్ పదవికి ఆర్.వాణీశ్రీయాదవ్ రాజీనామా చేశారు.ఈ మేరకు అమె మంగళవారం కొడంగల్‌కు విచ్చేసిన తాజీ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి తన రాజీనామా పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా అమె విలేకరులతో మాట్లాడుతు అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అపజయం పొందడంతో పాటు కొడంగల్‌లో పట్నం నరేందర్‌రెడ్డి ఓటమికి నైతిక బాధ్యత వహించి తాను మార్కెట్ కమిటీ వైస్‌చెర్మెన్ పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు.తన రాజీనామా పత్రాన్ని మార్కెట్ కమిటీ సెక్రటరీకి అందించినట్లు తెలిపారు.అలాగే మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు భాను, మధుసుదన్‌రెడ్డి తదితరులు తమ పదవులకు రాజీనామా చేశారు.అలాగే రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ సభ్యులు మద్దూర్ మాజీ జడ్పీటీసీ ఎండీ.సలీం తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.కొడంగల్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా పట్నం నరేందర్‌రెడ్డి ఓటమికి నైతిక బాధ్యత వహిస్తు పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.అలాగే కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చెర్మెన్ పదవికి బైరెడ్డి సుజాతరెడ్డి రాజీనామా పత్రాన్ని మార్కెట్ కమిటీ సెక్రటరీకి అందించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మధుసుదన్ యాదవ్, సలీం, టీటీ. రామునాయక్,కోట్ల యాదగిరి,విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మార్కెట్ కమిటీ వైస్‌చెర్మెన్ పదవికి రాజీనామా పత్రాన్ని మాజీ ఎమ్మెల్యేకు అందిస్తున్న వాణీశ్రీ

### నా విద్యాభ్యాస ప్రయాణం పుస్తకం ఉపయోగపడుతుంది : విద్యాధికారి



పూడూరు మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో నావిద్యాభ్యాస ప్రయాణం సుప్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండల విద్యాధికారి హరిశ్చందర్ తదితరులు

**పూడూరు, డిసెంబర్ 5, ప్రభాతవార్త :** విద్యార్థులు స్వయంగా విద్యను అభ్యసించేందుకు నా విద్యాభ్యాస ప్రయాణం పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని మండల విద్యాధికారి హరిశ్చందర్ పేర్కొన్నారు. మంగళవారం పూడూరు మండల విద్యావనరుల కేంద్రంలో శిక్షణా ఫౌండేషన్‌వారి కార్యచరణ పుస్తకాలు,నావిద్యాభ్యాస ప్రయాణం కార్డును ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం ద్వారా 2వ తరగతి నుండి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు తెలుగు,ఆంగ్లంతోపాటు గణితాన్ని సొంతంగా నేర్చుకునే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ ప్రాథమిక,ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,సిఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న జర్నలిస్టుకు ఆర్థిక సహాయం

**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 5, ప్రభాతవార్త:** గుండెపోటుతో నగరంలోని ఓ ప్రైవేటు అసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టుకి వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాల్ గ్రామానికి చెందిన శ్రీ పగడాల కనకయ్య మెమోరియల్ ఫౌండేషన్ చైర్మెన్ పగడాల మత్తు సేవాదృక్పథంతోని ఇబ్రహీంపట్నంలో ఐ న్యూస్ రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అంజికి హఠాత్తుగా గుండె పోటు రావడంతో వైద్య ఖర్చుల కోసం రూ.పదివేలు ఆర్థిక సహాయాన్ని పలువురు జర్నలిస్టుల ద్వార అందజేశారు.అంజి ఆరోగ్యం త్వరగా మెరుగు పడాలని కొరుకున్నారు. అదేవిదంగా తోటి జర్నలిస్టులు సైతం మేము అంజికి అండగా ఉంటామంటూ తమకు తోచిన ఆర్థిక సహాన్ని అందజేశారు. సేవాదృక్పథంతో ఆర్థిక సహాయాన్ని చేసిన మత్తుకు, తోటి జర్నలిస్టులకు అంజి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## రైతులకు నేల పరిరక్షణపై అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు




పూడూరు మండలం బాకాపూర్‌లో సోయిల్ హెల్త్‌కార్డులను అందజేస్తున్న సర్పంచ్ శివయ్య తదితరులు

**పూడూరు, డిసెంబర్ 5, ప్రభాతవార్త :** పూడూరు మండలం బాకాపూర్ గ్రామంలో మంగళవారం ప్రపంచ సోయిల్ దినోత్సవం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా కేంద్ర మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రం అధ్వర్యంలో పలువురు శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు నేల పరిరక్షణపై అవగాహన సదస్సును నిర్వహించి,రైతు హెల్త్‌కార్డులను అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివయ్య,క్రీడా ప్రధాన శాస్త్రవేత్తలు కెవిస్ రెడ్డి,జి నిర్మల,సంజీవరెడ్డి,ఎడిఎ లక్ష్మీకుమారి,ఎఓ తులసీరాం,ఎఇఓ రాంబాబు,పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

**కొడంగల్,డిసెంబర్ 5ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందించి తన ఉదారతను చాటుకున్నాడు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి కృష్ణంరాజు.వివరాల్లోకి వెళితే..కొడంగల్ పట్టణంలోని గాంధీనగర్‌కాలనీకి చెందిన సవారి దస్తగిరి కాంగ్రెస్ పార్టీలో చురుకుగా వ్యవహరించేవాడు.ఈ క్రమంలో ఆయన మంగళవారం అకస్మాత్తుగా మృతిచెందడం జరిగింది.విషయాన్ని తెలుసుకున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు రామకృష్ణ,చిరు,రాములు తదితరులు ఉన్నారు.

# చల్లంగా చూడు స్వామి...

### - షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
### - ఆంజనేయ స్వామి దేవాయలంలో ప్రత్యేక పూజలు ఎమ్మెల్యే

**షాద్‌నగర్, డిసెంబర్ 5, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం షాద్ణగర్ పట్టణ సమీపంలోని చౌదమ్మ గుట్ట ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత మొదటి సారి ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఎమ్మెల్యేను వేద మంత్రోచ్ఛరణలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ ఆంజనేయ స్వామి, శివాలయంలో తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించే ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడం జరిగిందని, మళ్లీ గెలిచిన తరువాత మొదటగా ఆలయంలో పూజలు చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని ప్రజలను చల్లంగా చూడు అంటూ ఆంజనేయ స్వామిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్‌కు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

